# అలకాపురి

-రత్నమాంబ చీర్ల

అది సుమారు పదెకరాల విశాల ప్రాంగణం. దూరదూరంగా అందంగా కుటీరాలు కనబడతాయి. ఒక్కో కుటీరంలో ఐదు కుటుంబాలు సౌఖ్యంగా ఉండడానికి ఐదు విడివిడి పోర్షన్లు ఉంటాయి. ప్రతి పోర్షన్‌లో హాలు, కిచెన్, అటాచ్డ్ బాత్రూం ఉంటాయి.

హాల్లో ఏసీ, ఫోన్, సోఫా, రెండుకుర్చీలు, టీవీ, రెండు సింగిల్ కాట్స్ ఉన్నాయి. కిచెన్‌లో మైక్రోవేవ్, ఫ్రిజ్, గ్యాస్ స్టౌ, సింక్ ఉన్నాయి. బాత్రూం విశాలంగా ఉండి వాష్ బేసిన్, గీజర్, వెస్టర్న్ కమోడ్ ఉన్నాయి. ప్రతి పోర్షన్‌కీ చిన్న బాల్కనీ ఉంది. అక్కడో రెండు కుర్చీలు, ఓ టేబుల్ ఉంటాయి. అటువంటి కుటీరాలు ఆ ప్రాంగణంలో పది ఉన్నాయి. మధ్యలో స్విమ్మింగ్ పూల్ ఉంది. అక్క లైఫ్ గార్డ్ ఎప్పుడూ ఉంటాడు. ఓ ప్రక్క విశాలమైన పార్క్, మరో ప్రక్క టెన్నిస్‌కోర్టు ఉన్నాయి. వాకింగ్ చెయ్యడానికి పార్క్ చుట్టూ వాక్‌వే ఉంది. స్విమ్మింగ్ పూల్ ప్రక్కనే ఆధునిక సదుపాయాలతో జిమ్ ఉంది. ఇవన్నీ ఉన్న ఈ ప్రాంగణం చుట్టూ ఒక పెద్ద ప్రహరీగోడ. దానికి ఒక పెద్దగేటు. గేటు ముందు సెక్యూరిటీ గార్డు. మనమెవరో అడిగి గేటు తీస్తాడు. ఈ అద్భుతమైన నివాసయోగ్య వైభవం పేరేమిటో తెలుసా? అలకాపురి.

వైభవం గురించి చెప్పేటప్పుడు వైకుంఠం, అమరావతి, అలకాపురి గురించి చెప్తారు. కుబేరుని పట్టణం పేరే అలకాపురి. కలియుగదైవం, సంపదల నిలయుడూ అయిన వేంకటేశ్వరస్వామికి అప్పిచ్చిన మహాధనవంతుడు కుబేరుడు. ఆయన పట్టణం అత్యంత రమణీయంగా, వైభవోపేతంగా ఉంటుందని పురాణాల్లో విన్నాం కదా! ఈ కమ్యూనిటీ కూడా అలకాపురిని తలపిస్తూ అత్యంత సుందరంగా ఉంది. ఇదంతా చదువుతూ ఉంటే అక్కడికెళ్లి ఉండాలనుకుంటున్నారా? అక్కడ ప్రవాస భారతీయుల తల్లిదండ్రులకు మాత్రమే ప్రవేశం. చూసి రావడానికైతే నో ప్రాబ్లెం.

కొడుకులు విదేశాల్లో ఉంటూ ఒంటరిజీవితం గడుపుతున్న వారి తల్లిదండ్రుల కోసం నిర్మించిన వృద్ధాశ్రమమిది. బెంగుళూరుకి కూతవేటు దూరంలో మైసూర్ వెళ్ళే దార్లో ఉంది. వైద్యసదుపాయం కూడా బ్రహ్మాండంగా ఉంది. అనుభవజ్ఞులైన డాక్టర్లు అందుబాటులో ఉంటారు. దగ్గర్లో చిన్న షాపింగ్ మాల్ ఉంది. అక్కడ అవసరమైన అన్ని వస్తువులూ దొరుకుతాయి. బయటికెళ్లి కొనుక్కోవాలంటే చిన్న లగ్జరీ బస్ సదుపాయం ఉంది. అందులో రోజా సాయంత్రం నాలుగున్నరకి వెళ్లి తొమ్మిదిలోపు వచ్చెయ్యచ్చు.

ఉదయం ఆరుకి పాలూ లేదా కాఫీ, ఎనిమిది గంటలకి బ్రేక్‌ఫాస్ట్‌తో పాటూ పండ్లు, పండ్లరసం ఉంటాయి. పన్నెండున్నరకి భోజనం, పరిశుభ్రమైన కిచెన్‌లో వండిన రుచికరమైన శాకాహార భోజనం, డైనింగ్ హాల్ చాలా పరిశుభ్రంగా, విశాలంగా ఉంటుంది. సాయంత్రం నాలుగ్గంటలకి స్నాక్స్, పాలు, కాఫీ లేక టీ ఉంటుంది. రాత్రి ఎనిమిది నుంచీ పదిగంటల వరకూ డిన్నర్ ఉంటుంది. ఉదయం ఐదుగంటలకి మూర్తిగారు సతీసమేతంగా వాకింగ్‌కెడతారు. అదే టైంకి శ్యామలమ్మగారూ, సుందరంగారూ, రావు దంపతులూ కూడా వస్తారు. పరస్పరం గుడ్‌మార్నింగ్‌లు చెప్పుకుని వాకింగ్ ప్రారంభిస్తారు. మధ్యలో కాలక్షేపానికి కబుర్లు, వారంతా షష్టిపూర్తి ఐనవాళ్ళే.

"ఏమిటి శ్యామలమ్మగారూ! ఈరోజు వెనుకబడిపోతున్నారూ?" అన్నారు మూర్తిగారు.

"మనసేం బాగోలేదు అన్నయ్యగారూ! మాటిమాటికీ మనవలు గుర్తొస్తున్నారు" అని కళ్లు వత్తుకుంది శామలమ్మ.

"పోనీ ఒకసారి వెళ్లిరాకపోయారా అబ్బాయి దగ్గరకి" అన్నారు సానుభూతిగా మూర్తిగారు.

"వెళ్లివాళ్లని ఇబ్బంది పెట్టడమే అవుతుంది. మా కోడలు కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కదా. రోజా ఉదయమే వెళ్లిపోయి సాయంత్రం లేట్‌గా వస్తుంది. రాగానే పిజ్జానో, పాస్తానో, బ్రెడ్‌జాం ఇచ్చేస్తుంది పిల్లలకి. కొడుకూ, కోడలూ కూడా అవే అలవాటుచేసేసుకున్నారు. నేను వండే వంటలు పిల్లలకి నచ్చవు. మావాడు "అమ్మా! శ్రమపడి నీవు అవన్నీ చేయకు. ఎవరూ తినరు. నాకు కూడా మన ఫుడ్ అలవాటు తప్పిపోయింది. నీకు మాత్రమే చేసుకో అమ్మా!" అని నెమ్మదిగా చెప్పాడు. అక్కడుండి ఏం చెయ్యాలో తెలియని అయోమయపరిస్థితి. నా ఉనికి వాళ్ళకి ఉపయోగం లేదు. అందుకే ఇక్కడుంటున్నా అన్నయ్యగారూ!" అంది దగ్గుత్తికతో శ్యామలమ్మ.

"మూర్తిగారూ! మీరెళ్ళి మీ పిల్లల దగ్గర ఉండొచ్చు కదా!" అని రావుగారు అడిగారు.

"వెళ్లవచ్చు కానీ నాకక్కడ తోచదు. పిల్లలు తీసికెళ్తే తప్ప ఎక్కడికీ వెళ్లడానికి కుండదు. పోనీ నువ్వుండు వాళ్లకి ఉపయోగపడతావు కదా అంటే మా ఆవిడ నన్ను విడిచి ఉండనంటుంది. అందుకే ఈ ప్రస్థానం" అన్నారు మూర్తిగారు.

ఈలోగా సుందరం గారూ అక్కడికి చేరారు.

"మీరెందుకండీ వంటరిగా ఇక్కడ. మీ అమ్మాయిలిద్దరూ అమెరికాలో ఉన్నారు కదా. వాళ్లతో ఉండొచ్చు కదా?" అన్నారు రావుగారు.

"కూతుళ్ళు ఎంత ప్రేమగా చూసుకున్నా అల్లుళ్ళ ఇళ్ళల్లో పడి తినడం మొహమాటంగా ఉండి ఉండలేక వచ్చేశా" అన్నారు సుందరం గారు. కొత్తగా ఈమధ్యే వచ్చి ఉంటున్న సుబ్బారావు దంపతులు వాకింగ్‌కి వచ్చి వాళ్లని కలిశారు.

వాళ్ల మాటలు వింటున్న సుబ్బారావుగారి భార్య జానకమ్మ కలగజేసుకుని "మేమూ అబ్బాయిల దగ్గరకెళ్లాం ఉందామని. పెద్ద కోడలు చాలా మితభాషి. మాట్లాడ్డమే అపురూపం. పిల్లల చదువులు, తన ఉద్యోగం తప్ప ఏం పట్టవు. మా పెద్దాడు చాలా ఆలస్యంగా ఇంటికొస్తాడు అలిసిపోయి. ఏదో తిన్నానన్న పేరుకు రెండు మెతుకులు తిని వెళ్లి పడుకుంటాడు. శని, ఆదివారాలు శలవులే ఐనా ఇల్లు క్లీనింగ్, వాషింగ్, లాన్ కట్ చేస్కోవడం లాంటి పనుల్తో వాళ్లకు టైం ఉండదు. ఆ యాంత్రిక జీవనంలో ఇమడలేక చిన్నాడి దగ్గర కెళ్లాం. మా కోడలు 'నా మొగుడు నాకే సొంతం, నాపిల్లలూ, నా మొగుడూ, నేనూ...అంతే' అనే బాపతు. వెళ్లిననాడు వచ్చారా అంటుంది. మళ్లీ వచ్చేసేరోజు అప్పుడే వెళ్లిపోతున్నారా అంటుంది. ఇంక నా కొడుకు "ఒరేయ్ మాటా, పలుకూ లేకుండా ఉండలేకపోతున్నాం రా" అంటే "మాట్లా

డుకుంటూ అస్తమానం గొడవలు పడేకంటే ఇదే మంచిది కదా హాయిగా ఉండండి'' అంటాడు. అంత హాయిని భరించలేక వచ్చేసి ఇక్కడుంటున్నాం'' అని నిట్టూర్చింది జానకమ్మ.

"అప్పుడే చాలా టైమే అయ్యింది. కబుర్లలో తెలీలేదు నడవండి'' అంటూ ఎవరి కాటేజ్‌కి వాళ్ళు బయల్దేరారు. మూర్తిగారు అన్యమనస్కంగా ఉండడం గమనించి రాధమ్మ "ఏమిటండీ దీర్ఘాలోచనలో ఉన్నారు?'' అంది.

"వాళ్లందరి మాటలూ విన్నావు కదా, నీకేమనిపిస్తోంది?'' అన్నారు.

"ఒక్కొక్క కాటేజ్‌కి ఇరవై వేలు నెలనెలా కడుతున్నారు. అది కాకుండా పై ఖర్చు మరో పది వేలు. పిల్లలు అక్కడ రెక్కలు ముక్కలు చేసుకుంటూంటే మనం ఇక్కడ ఎంజాయ్ చెయ్యడం ఎంతవరకూ న్యాయమో ఆలోచించండి. మనం పిల్లల దగ్గర ఉండలేకపోవడానికి చెప్పుకునే కారణాలు చిన్న చిన్నవి. కొంచెం సర్దుకుపోతే నెమ్మదిగా మనవాళ్ళు మనల్ని అర్ధంచేసుకునే వాతావరణాన్ని కల్పించగలిగితే హాయిగా శేషజీవితాన్ని పిల్లల్తో, మనవల్తో గడపవచ్చనిపిస్తోంది'' అంది రాధమ్మ.

"నేనూ అదే అనుకుంటున్నాను రాధా. మన పెద్దవాళ్ళు ఉమ్మడికుటుంబ వ్యవస్థలో సర్దుకుపోలేదా? అత్తలూ, మామలూ, బావగార్లూ, మరుదులు, తోడికోడళ్ళూ, ఆడబడుచులూ, వాళ్ల పిల్లలూ, వచ్చేపోయే చుట్టాలూ, అంతమంది మధ్యలో చిన్నచిన్న సమస్యలొచ్చినా సర్దుకపోలేదా! ఉద్యోగాలొచ్చి వలసవిధానాలొచ్చి, ప్రతి వ్యక్తీ స్వార్థంతో, సంకుచితంగా ఆలోచిస్తున్నాడు. ఇల్లాలు కూడా అత్తమామలకు దూరంగా భర్తతో, పిల్లలతో సుఖంగా ఉంటున్నాననే భ్రాంతిలో బ్రతుకుతోంది. ఏదైనా సమస్య వస్తే తల్లడిల్లిపోయి విడాకులూ, ఆత్మహత్యల వరకూ వెడుతున్నారు దంపతులు. ఆటైంలో తల్లిదండ్రులు గానీ, అత్తమామలు గానీ దగ్గరుంటే వారి ఆలోచనా విధానాన్ని చక్కదిద్దే అవకాశం ఉంటుంది'' అన్నారు సాలోచనగా మూర్తిగారు.

"మరి ఆలస్యమెందుకూ. మీరూ నా దార్లోకే వచ్చారు కనక అబ్బాయికి ఫోన్ చేసి బయల్దేరుతున్నామని చెప్దాం. మనకెట్లాగూ పదేళ్ల వీసా ఉంది గనక...'' అని ఉత్సాహంగా లేచింది రాధమ్మ.

మూర్తిగారు ట్రావెల్ ఏజెంట్‌కి ఫోన్ చేసి టికెట్స్ బుక్ చేయించడంలో బిజీ ఐపోయారు.

★

